క్లుప్తంగా

నదీ జలాల సంరక్షణపై ప్రజలకు అవగాహన


కేతన్ గార్గ్, కార్పొరేషన్ కమిషనర్

రాజమహేంద్రవరం సిటీ: నదీ జలాలను సంరక్షించి, రాబోయే తరాలకు నీటి ఎద్దడి లేకుండా చేసేందుకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో ప్రజలందరూ పాల్గొనాలని నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ పిలుపునిచ్చారు. ఆయన బుధవారం మాట్లాడుతూ జాతీయ జలవనరుల శాఖ, జల శక్తి విభాగం, నదీ సంరక్షణ సంస్థ ఆదేశాల మేరకు నగరంలో నదీ జలాల సంరక్షణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. దీనిలో భాగంగా ఈ నెల 25న మున్సిపల్ స్కూళ్లలో చిత్రలేఖనం, స్లోగన్ రైటింగ్ పోటీ నిర్వహించామన్నారు. అలాగే 27న పుష్కరఘాట్‌లో బోట్ రేస్, నగర పాలక సంస్థ కార్యాలయం దగ్గరలోని కాస్మోపాలిటన్ క్లబ్ గోడపై మ్యూరల్ పెయింటింగ్, నీటి సంరక్షణ అంశంపై వై.జంక్షన్ నుంచి పుష్కరఘాట్ వరకూ ఊరేగింపు, సాయంత్రం పుష్కర్ ఘాట్‌లో సాంస్కృతిక కార్యక్రమాలు, పోటీలలో పాల్గొన్న విజేతలకు బహుమతి ప్రదానం, 28న పుష్కరఘాట్ వద్ద యోగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గోవులు, గేదెలను తరలిస్తున్న కంటైనర్ సీజ్


కంటైనర్‌లో ఉన్న గోవులు

రాజమహేంద్రవరం రూరల్: విజయనగరం జిల్లా నుంచి కేరళకు ఎద్దులు, గేదెలను తరలిస్తున్న కంటైనర్‌ను బుధవారం దివాన్ చెరువు జీరో పాయింట్ వద్ద గోసేవ ఫౌండేషన్ సభ్యులు అడ్డుకున్నారు. వారి సమాచారం మేరకు బొమ్మూరు ఎస్సై ప్రియకుమార్, సిబ్బందితో వెళ్లి కంటైనర్‌ను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. గోసేవ ఫౌండేషన్ అధ్యక్షుడు మోటుపల్లి సాయిరంగభాను ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డ్రైవర్, క్లీనర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కంటైనర్‌లోని 20 ఎద్దులు, 17 గేదెలను రాజమహేంద్రవరంలోని గోశాలకు తరలించినట్లు ఎస్సై ప్రియకుమార్ తెలిపారు.

యువకుల మృతి బాధాకరం

రాజమహేంద్రవరం సిటీ: తాళ్లపూడి మండలం తాడిపూడి ఇసుక ర్యాంపు వద్ద బుధవారం ఉదయం స్నానానికి దిగి ఐదుగురు యువకులు మృతి చెందడం బాధాకరమని రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురంధేశ్వరి అన్నారు. మృతుల కుటుంబాలకు ఆమె ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ ఘటనపై కలెక్టర్‌తో ఫోన్‌లో ఆరా తీశారు. రేవుల్లో కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని, లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోకి స్నానాలకు దిగకుండా చూడాలని ఆమె సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ ఘటన విషయాన్ని తీసుకెళ్లి మృతుల కుటుంబాలకు సహాయం అందేలా చూస్తానని తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కడియం: రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడని రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు తెలిపారు. కడియం– రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్ల మధ్యలో సుమారు 25 ఏళ్ల వయసున్న గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 24న రక్తపు గాయాలతో పడి ఉన్నాడన్నారు. అతడిని చికిత్స కోసం 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారన్నారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశాడని తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచామన్నారు. అతడి ఒంటిపై లేత నీలిరంగు నెక్ బనియన్, నలుపురంగు టీ షర్ట్, నలుపు రంగు షార్ట్ ఉన్నాయన్నారు. ఎడమ చేతి ముంజేతిపై బుజ్జి అని, ఎడమచేతి మణికట్టుపై బాయ్ అని టాటూలు వేశారన్నారు. ఆచూకీ తెలిసినవారు 94406 27551, 94914 44022 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు.

సినిమాలు



శ్యామల	: సంక్రాంతికి వస్తున్నాం
సూర్యమినీ	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సూర్యప్యాలెస్	: చావా
స్వామి	: బ్రహ్మా ఆనందం
శివజ్యోతి	: మజాకా
అనుశ్రీ	: మజాకా
రాజా	: సంక్రాంతికి వస్తున్నాం
ఊర్వశి	: రామం రాఘవం
మేనక	: తల
రంభ	: బాపు
కుమారి	: రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
అప్సర	: తండేల్
అశోక	: జాబిలమ్మ నీకు అంత కోపమా
నామవరం	
వీఎస్ మహల్	: మజాకా
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	: మజాకా
కడియం	
వెంకటసూర్య	: మజాకా


పుష్కరాల రేవులో శంఖం పూరిస్తున్న జంగన్న దొర


మహా కాళేశ్వరాలయంలో భస్మాభిషేకం చేస్తున్న భక్తులు


ఉమా కోటిలింగేశ్వరస్వామి రథోత్సవం


అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు


దుళ్లలో నిర్వహించిన రథోత్సవం

ముక్కంటి స్మరణలో భక్త కోటి

- మార్మోగిన శివనామస్మరణ
- గోదావరి ఘాట్లలో భక్తుల పుణ్యస్నానాలు
- ఆలయాల్లో రద్దీ
- భారీగా ప్రసాద వితరణలు

సీటీఆర్‌ఐ: మహాశివరాత్రి సందర్భంగా గోదావరి తీరం బుధవారం శివనామ స్మరణతో మార్మోగింది. తెల్లవారుజాము మూడు గంటల నుంచే భక్తులు గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం పరమేశ్వరుని దర్శనానికి పోటెత్తారు. నగరంలోని అన్ని శివాలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. కోటిలింగాల క్షేత్రం, ఉమా మార్కండేయేశ్వరస్వామి దేవాలయం, సారంగధరేశ్వరస్వామి ఆలయం, జాంపేటలోని ఉమా రామ లింగేశ్వరస్వామి ఆలయం, శంకర మఠం శారద పీఠంలోని స్ఫటిక లింగేశ్వరస్వామి ఆలయాల్లో పూజలు నిర్వహించారు. కోటిలింగాల క్షేత్రంలో బుధవారం మధ్యాహ్నం స్వామివారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో నగరంలో పలుచోట్ల శివలింగాలను ఏర్పాటు చేసి శివతత్వాన్ని భోధించారు. సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ గోదావరి పుణ్యస్నానమాచరించారు. అనంతరం నగరంలోని పలు ఆలయాలను దర్శించుకున్నారు.

- సీతంపేట వాటర్ ట్యాంకులకు ఎదురుగా టీకే విశ్వేశ్వర్ రెడ్డి నిర్మించిన తేతలి కనికిరెడ్డి బస్టాండు వద్ద పులిహోర, వాటర్ ప్యాకెట్లు పంపిణీ చేశారు.
- నల్లమందు సందు, గంటాలమ్మ గుడి వీధి వర్తకులు, ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో 18వ మహాశివరాత్రి మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారీ అన్నప్రసాద వితరణ జరిగింది. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.


కోటిలింగాలరేవులో భక్తుల రద్దీ

తెల్లవారుజామునుంచే..

కడియం: మండలంలోని శివాలయాలకు తెల్లవారుజాము రెండు గంటల నుంచే భక్తుల రద్దీ ఏర్పడింది. ఆయా ఆలయాల్లో ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కడియం, దుళ్ల గ్రామాల్లో రథోత్సవాలు జరిగాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కడియంలోని భ్రమరాంబికా మల్లేశ్వరస్వామి, కడియపులంకలోని అపర్ణా సమేత అనంతేశ్వర స్వామి, దుళ్లలోని బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వరస్వామి, వీరవరం, వేమగిరి, జేగురుపాడు, మురమండ, మాధవరాయుడుపాలెం గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు.

అన్నదానాలు

కడియపులంక పాత పువ్వుల మార్కెట్‌లోని ఆంజనేయ స్వామివారి వజ్రోత్సవ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు 60 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అలాగే అనంతేశ్వరుడు, ఆంజనేయ స్వామివార్లను మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. ఆయా ఆలయ కమిటీలు, స్థానిక నాయకులు వారికి ఘన స్వాగతం పలికారు. కడియపులంక, మాధవరాయుడుపాలెం, దుళ్ల, మురమండ గ్రామాల్లో భారీ అన్న ప్రసాద వితరణలు జరిగాయి. డీఎస్పీ భవ్యకిశోర్ పర్యవేక్షణలో పోలీసులు భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివపార్వతుల కల్యాణం

రాజమహేంద్రవరం రూరల్: మోరంపూడి జంక్షన్‌లోని సీవీ రావు గార్డెన్స్‌లో సాయి భక్తాంజనేయ స్వీట్స్ అధినేత వలవల చక్రపాణి, మోహిని దంపతుల ఆధ్వర్యంలో 30వ మహాఅన్నసమారాధన ఘనంగా నిర్వహించారు. వేలాది మంది భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదం స్వీకరించారు. ముందుగా శ్రీపాద వ్యాఘ్రేశ్వరశర్మ ఆధ్వర్యంలో శివపార్వతుల కల్యాణాన్ని ప్రతాప్, ప్రదీప్ చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం వీఎల్ పురం వినాయకుడి గుడి నుంచి మోరంపూడి జంక్షన్ వరకూ 108 కలశాలతో మహిళలు తీసుకుని వచ్చిన మహాకుంభాభిషేక జలాలతో గురుస్వామి ఆమంచి ఆంజనేయస్వామిచే స్వామికి అభిషేకం నిర్వహించారు. సాయంత్రం మహాగురు నరేంద్ర నాథ యోగేశ్వరేశ్వరస్వామి ప్రసన్న ఆధ్వర్యంలో 23 హారతులు భజనామృతం, రాత్రి వాసుదేవ కోలాట భజన మండలి గుమ్మడి రవి కోలాటం, దత్త ఉపాసకులు సతీష్ బృందం భజన, గురు తత్వంపై ఉపన్యాసం జరిగాయి.


కడియపులంకలోని అనంతేశ్వరస్వామి

ధవళేశ్వరంలో..

ధవళేశ్వరం: శివనామస్మరణతో ధవళేశ్వరం పులకించింది. గ్రామంలో కొలువైన అగస్త్యేశ్వర స్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. తెల్లవారు జాము నుంచే రామపాదాల క్షేత్రంలో పుణ్య స్నానాలు ఆచరించారు. దేవస్థానం, పోలీస్, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. జనార్దనస్వామి కొండ వెనుకవైపు కొలువైయున్న విద్యాధరేశ్వరస్వామికి, రామపాదాల క్షేత్రంలోని ఉమా రామలింగేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్ద ఉత్సవ కమిటీ చైర్మన్ యడ్ల వెంకటేష్ ఆధ్వర్యంలో ప్రసాదం వితరణ చేశారు. ఆలయ అర్చకులు విశ్వనాథ శర్మ, చిన్న పూజా కార్యక్రమాలు నిర్వహించారు.


పూజలు అందుకుంటున్న ధవళేశ్వరంలోని అగస్త్యేశ్వరస్వామి

అల్పాహారం వితరణ

బాలా త్రిపుర సుందరీ సమేత అగస్త్యేశ్వర స్వామి దర్శనానికి విచ్చేసిన భక్తులకు జంగాల వీధి, రథం వీధి ఫ్రెండ్స్ సర్కిల్, జనసేన పార్టీ నాయకులు యడ్ల మహేష్ ఆధ్వర్యంలో అల్పాహార వితరణ చేశారు. సీఐ టి.గణేష్ చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది.

మజ్జిగ పంపిణీ

అగస్త్యేశ్వర స్వామి ఆలయం వద్ద స్ఫూర్తి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల పోసికుమార్, సత్య దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ పంపిణీ చేశారు. కండేపల్లి వీరరాఘవ సాగర్, వాసవి, పలివెల వీరేష్ తదితరులు పాల్గొన్నారు.


మోరంపూడి జంక్షన్‌లో శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు


మోరంపూడిలో జరిగిన మహా అన్నసమారాధన


కడియపులకంలో పాత పువ్వుల మార్కెట్‌లో ఆంజనేయస్వామి


భక్తులకు ప్రసాదం అందజేస్తున్న సీఐ గణేష్, మహేష్ తదితరులు


మజ్జిగ పంపిణీ చేస్తున్న ముత్యాల పోసికుమార్

ఘనంగా ఆర్‌సీఎం చర్చి శత వార్షికోత్సవం


ఆర్‌సీఎం చర్చి శత వసంతాల వేడుకలో కేక్ కట్ చేస్తున్న బిషప్‌లు


సెయింటాన్స్ స్కూలు విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

- బిషప్‌ల చేతుల మీదుగా వేడుకలు
- తరలివచ్చిన విశ్వాసులు
- అలరించిన సాంస్కృతిక ప్రదర్శనలు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఫ్రెంచ్ గురువులు నిర్మించిన పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి(ఆర్‌సీఎం) శత వసంతంలోకి అడుగుపెట్టడం ఆనందకరమని విశాఖపట్నం ఆర్క్ డయాసీస్ అపోస్టలిక్ అడ్మినిస్ట్రేటర్ రెవరెండ్ బిషప్ పొలిమేర జయరావు అన్నారు. అల్కాట్‌తోటలోని ఆర్‌సీఎం చర్చి శత వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొలిమేర జయరావు, శ్రీకాకుళం బిషప్ రాయరాల విజయ కుమార్, విశాఖపట్నం ఆర్క్ బిషప్ మల్లవరపు ప్రకాష్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. చర్చి శత వార్షికోత్సవంలోకి అడుగుపెట్టిన సందర్భంగా దైవజనులు, విశ్వాసులకు శుభాకాంక్షలు తెలిపారు. గురుత్వ రజత జూబ్లీ వేడుకలు జరుపుకొంటున్న రెవరెండ్ ఫాదర్ బవిరి సురేష్, రెవరెండ్ ఫాదర్ ఆగ్నేల్ రవీంద్ర కుమార్ 25 ఏళ్ల పాటు విశిష్ట సేవలు అందించారన్నారు. ఈ సందర్భంగా ప్రావిన్షియల్ సుపీరియర్ బవిరి సురేష్, పునీత జోన్ ఆఫ్ ఆర్క్ చర్చి ఫాదర్ ఆగ్నేల్ రవీంద్ర కుమార్‌లను బిషప్‌లు, గురువులు, విశ్వాసులు, కుటుంబ సభ్యులు ఘనంగా సత్కరించారు. ముందుగా 100 కిలోల కేక్‌ను కట్ చేశారు. సెయింటాన్స్ స్కూల్ విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఆర్‌సీఎం చర్చి అసిస్టెంట్ ఫాదర్ కె.ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలలో అధిక సంఖ్యలో గురువులు, కౌన్సిల్ మెంబర్లు, విశ్వాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు పటిష్ట చర్యలు

కంబాలచెరువు: గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు ఎస్పీ డి.నరసింహ కిశోర్ తెలిపారు. ఆ ఎన్నికల ప్రక్రియ నిర్వహణపై పోలీసులు, అధికారులు, సిబ్బందికి బుధవారం పలు అంశాలను వివరించారు. ఆర్ట్స్ కళాశాల నుంచి పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సామగ్రి తరలింపు ప్రక్రియను ఎస్పీ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తన నియమావళికి లోబడి అందరూ విధులలో అప్రమత్తంగా ఉండాలన్నారు. పట్టభద్రులు నిర్భయంగా, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాతో పాటు భద్రత మరింత కట్టుదిట్టం చేశామన్నారు.


ఎన్నికల విధులపై అవగాహన కల్పిస్తున్న ఎస్పీ నరసింహ కిశోర్

యువకుడి ఆత్మహత్య

కంబాలచెరువు: ప్రేమ వివాహానికి పెద్దలు నిరాకరించడంతో ఓ యువకుడు పురుగుమందు ఆత్మహత్య చేసుకున్నాడు. మూడో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం ఈ ఘటన జరిగింది. నగరంలోని జెండా పంజా రోడ్డులోని కవర్ల దుకాణంలో ఆసిఫ్ (23) పనిచేస్తున్నాడు. అతడు కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. అయితే వీరి పెళ్లికి పెద్దలు నిరాకరించడతో మనస్తాపం చెంది పురుగు మందు తాగాడు. అచేతనంగా రోడ్డుపై పడి ఉన్న అతడిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. అక్కడి చికిత్స పొందుతూ మృతి చెందాడు.

మట్టి శివలింగానికి పూజలు

రాజానగరం: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని రాజానగరం న్యూసిటీ కాలనీ వాసులు మట్టితో శివలింగాన్ని తయారు చేసి అభిషేకించారు. సాయంత్రం దీపారాధనలు చేసి, పూజలు ప్రారంభించి, శివనామ స్తోత్రంతో లింగోద్భవ సమయం వరకు పాలు, పండ్ల రసాలతో అభిషేకాలు చేశారు. ఏకాలంలో ఈ అభిషేకాలతో మట్టి శివలింగానికి నిమజ్జనం కూడా జరిగిపోయింది.


శివ లింగానికి పూజలు చేస్తున్న మహిళలు

ఉరి వేసుకుని వివాహిత ఆత్మహత్య


శ్రావణి మృతదేహం

సీతానగరం: మండలంలోని సింగవరానికి చెందిన గుమ్మళ్ల శ్రావణి (29) అనే వివాహిత బుధవారం ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రావణికి పదేళ్ల క్రితం వివాహమైంది. ఆమెకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా.. ఇంటిలోని అత్తమావలు, భర్త లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె కొంత కాలంగా కడుపు నొప్పితో బాధపడుతోందని, తట్టుకోలేక ఈ అఘాయిత్యానికి పాల్పడిందని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. అయితే కుటుంబ కలహాలు కారణమని వార్తలు వినిపిస్తున్నాయి. ఆమె భర్త దుర్గాప్రసాద్ కోడిగుడ్ల వ్యాపారం చేస్తుంటాడు. శ్రావణి మృతదేహాన్ని పోలీసులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

శివరాత్రి ఉత్సవాల్లో వలంటీర్ల సేవలు

కంబాలచెరువు: శివరాత్రి సందర్భంగా నగరంలోని పలు దేవాలయాలు, స్నానాల ఘాట్ల వద్ద భక్తులకు స్థానిక ఆదిత్య కళాశాలల ఎన్ఎస్ఎస్, యూత్ రెడ్ క్రాస్ వలంటీర్లు సేవలు అందించారని ఆ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ జి.నాగేశ్వరరావు బుధవారం తెలిపారు. జాంపేట ఉమా రామలింగేశ్వర స్వామి కల్యాణ మండపం, కోటిలింగాలరేవు, ఉజ్జయిని మహా కాళేశ్వరాలయం, మార్కండేయేశ్వరస్వామి ఆలయాల వద్ద తెల్లవారుజామున మూడు గంటలకు చేరుకున్నారన్నారు. స్నానాలు చేసే భక్తులకు, చంటిబిడ్డ తల్లులకు, గుడిని దర్శించడానికి వచ్చిన వారికి చేదోడువాదోడుగా అనేక సేవలు అందించారన్నారు. వలంటీర్లను కళాశాల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ సుగుణారెడ్డి అభినందించారు.

- తాడితోట జంక్షన్‌లోని సంహిత డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ తోట రామకృష్ణ బుధవారం తెలిపారు. దేవాలయాల వద్ద భక్తులను క్రమపద్ధతిలో పంపడం, స్నానాల ఘాట్లకు సహకారం అందించారన్నారు. శివరాత్రి ఉత్సవాల్లో సేవలందించిన వలంటీర్లను కళాశాల ఏవో జి.బాలకృష్ణ, సీహెచ్.రామకృష్ణ, అధ్యాపకులు అభినందించారు.

‘హార్లిక్స్’లో చారిత్రాత్మక ఒప్పందం

ధవళేశ్వరం: హిందూస్తాన్ యూనిలివర్ (హార్లిక్స్ ఫ్యాక్టరీ)లో గోదావరి జీఎస్‌కే వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చారిత్రాత్మకమైన నూతన వేతన ఒప్పందం జరిగిందని యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.దేవసహాయం (పెద్ద) తెలిపారు. తనతో పాటు అధ్యక్షుడు వి.నాగేశ్వరరావు, కోశాధికారి టి.సూర్యారావు, ఉపాధ్యక్షుడు నారపురెడ్డి మురళి, యూనియన్ సభ్యులు ఆధ్వర్యంలో ఒప్పందం జరిగిందన్నారు. ఈ మేరకు బుధవారం రాత్రి నిర్వహించిన యూనియన్ సర్వసభ్య సమావేశంలో ఒప్పందం వివరాలను వెల్లడించారు. నూతన ఒప్పందం ప్రకారం బదిలీలు అందరూ పర్మినెంట్ కాబోతున్నారన్నారు. ప్రతి కార్మికుడికీ వడ్డీ లేని అప్పు అందుతుందన్నారు.


నూతన కార్మిక ఒప్పందంపై హర్షం వ్యక్తం చేస్తున్న యూనియన్ నాయకులు

పట్టిసీమ వీరభద్రుని దర్శనానికి భక్తుల పయనం


వంగలపూడి రేవు నుంచి ట్రాక్టర్‌పై పట్టిసీమ వెళుతున్న భక్తులు


రామచంద్రపురం రేవు నుంచి వీరభద్రుని దర్శనానికి తరలివెళుతున్న భక్తులు

సీతానగరం: మహాశివరాత్రి సందర్భంగా ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరి మధ్యలో కొలువైన భద్రకాళీ సమేత వీరభద్రుని దర్శనానికి వంగలపూడి, రామచంద్రపురం రేవుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివెళ్లారు. వంగలపూడి రేవు నుంచి గోదావరి పాయపై వేసిన నడక మార్గం ద్వారా, పురుషోత్తపట్నం పంచాయతీ పరిధిలోని రామచంద్రపురం రేవు నుంచి ట్రాక్టర్లపై భక్తులు పయనమయ్యారు. వంగలపూడి రేవులోని మృత్యుంజయుని విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు 25 వేలు మంది భక్తులువెళ్లారని, రాత్రి 10 గంటలకు వారి సంఖ్య 35 వేలకు చేరుకుందని అధికారుల తెలిపారు.

అధికారుల పర్యవేక్షణ

పట్టిసీమకు తరలివెళ్లే భక్తుల కోసం చేసిన ఏర్పాట్లను తహసీల్దార్ ఎ.శ్రీనివాస్, ఎంపీడీవో ఎం.భారతి, ఈవోపీఆర్డీ కేవీఎస్ఎస్ మూర్తి, పంచాయతీ కార్యదర్శి ఆర్.సుజాత, సర్పంచ్ కొంచ అన్నపూర్ణ, ఉత్సవ కమిటీ పర్యవేక్షించారు. వంగలపూడి, రామచంద్రపురం రేవులలో భక్తులకు భోజనం ఏర్పాట్లు చేశారు. రేవులలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ఎస్సై డి.రామ్ కుమార్, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. డీఎస్పీ వై.శ్రీకాంత్, సీఐ వై.సత్యకిషోర్ రేవులో పర్యవేక్షించారు. వంగలపూడి రేవులో సీతానగరం డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సేవలు అందించారు. సీపీఎం ఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివెల వీరబాబు ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ ప్యాకెట్లును అందించారు. కాగా.. మండలంలోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.